www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 14 జులై 2025

1100 సేవలు వినియోగించుకోండి : కలెక్టర్

భీమవరం : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి %Meekosam.ap.gov.in% వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చున్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఉధృతంగా వశిష్ట గోదావరి

కోడేరు పుష్కర ఘాట్ వద్ద మూడు అడుగులకు చేరిన నీరు - లంకగ్రామాల ప్రజల ఆందోళన

ఆచంట: లంకగ్రామాలకు పడవలపై వెళ్తున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కోడేరు పుష్కర ఘాట్ వద్ద ఆదివారం సాయంత్రానికి మూడు అడుగులకు వరద నీరు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద గంట గంటకూ పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుత వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కోడేరు వద్ద క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నదీ తీర ప్రాంతాల ప్రజల్లో కలవరం మొదలైంది. వరద నీరు నెమ్మది నెమ్మదిగా పల్లపులంక ప్రాంతాల్లోకి చేరుతోంది. భీమలాపురం ఏటిగట్టు దిగువ ఉన్న నివాస ప్రాంతాల వారిని వరద ఏక్షణాన్నైనా చుట్టుముట్టే ప్రమాదం ఉండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం లంక భూముల్లో తమలపాకు, పచ్చిమిర్చి, అరటి, కొబ్బరి, మునగ, జామ, ఆకుకూరలు పండిస్తున్నారు. వరద మరింత పెరుగుతుండడంతో రైతులకు కంటిమీద కొనుకు ఉండడం లేదు. ఆచంట మండలం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, అయోధ్యలంక, పచ్చల్లంక మర్రిమూల, రాయిలంక, పెదమల్లంలంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. రైతులు లంక గ్రామాల నుంచి పడవల మీద కొబ్బరికాయలు రవాణా చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పశువులను ఏటిగట్టుకు తరలిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తోటకూర, గోంగూర, పాలకూర, కొత్తిమీర, బెండ, పచ్చిమిర్చి, వంగ తోటలోకి నీరు చేరుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నాటికి గోదావరి మరింత పెరిగే అవకాశం ఉందని లంక గ్రామాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు హెచ్చరికలు జారీ చేశారు. లంక గ్రామాల్లో రెవెన్యూ, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. కోడేరు వద్ద రెండు ఇంజిన్ పడవలను అందుబాటులో ఉంచినట్లు తహశీల్దార్ అధికారులు తెలిపారు.

కనకాయలంక కాజ్‌వేపై వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

కనకాయలంక కాజ్‌వే పైకి చేరిన వరద నీరు

యలమంచిలి : గోదావరి వరద ఆదివారం ఉధృతంగా ప్రవహిస్తోంది. గంట గంటకూ నీటిమట్టం పెరగడంతో మండలంలోని కనకాయలంక కాజ్‌వే పైకి వరద నీరు చేరింది. వరద మరింత పెరిగితే కాజ్‌వేపై రాకపోకలకు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పర్యటించి వరద ప్రవాహాన్ని పరిశీలించి అధికారులతో సమీక్షించారు ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ కనకాయలంక కాజ్ వే పైకి వరద నీరు చేరినా ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేదని, వరద తీవ్రత సాయంత్రానికి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ఒకవేళ వరద పెరిగితే ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బోట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట విఆర్ఒలు శ్రీనివాసరావు, గ్రామ నాయకులు మస్కుడి రాంబాబు, ఆకుమర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ఇంకా ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే
12 గ్రామాలకు మూడు రోజులుగా నిలిచిన రాకపోకలు
భద్రాచలంలో 31.06 అడుగులకు తగ్గిన నీటిమట్టం

పోలవరం : పట్టిసీమ వద్ద తగ్గిన గోదావరి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గత వారం రోజులుగా గోదావరికి పెరుగుతూ వచ్చిన వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో శనివారం 41.3 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం ఆదివారం నాటికి 31.06 అడుగులకు తగ్గింది. గోదావరి వరద ఉధృతి తగ్గినా కుక్కునూరు, దాచారం మధ్య గుండేటివాగుపై కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండడంతో అవతల ఉన్న 12 గిరిజన గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు, కుక్కునూరులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రతిరోజు కుక్కునూరు రావాల్సి ఉంటుంది. వీరంతా మండల కేంద్రానికి రావాలంటే బస్సు సౌకర్యం లేక చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి ఆటోలను ఆశ్రయించి రావాల్సిన పరిస్థితి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వరద ప్రభావిత ప్రాంతమైన గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 253 కుటుంబాలను రావికుంట పునరావాస కేంద్రానికి తరలించారు. గోదావరికి వరద ఉధృతి తగ్గడంతో ముంపు మండలాల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

స్పిల్‌వే నుంచి 7,41,269 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

పోలవరం : పోలవరంలో గోదావరి జలాలు ఆదివారం సాయంత్రం నాటికి స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్ట్ స్పిల్‌వే నుండి 7,41,269 అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 31,420 మీటర్లు, దిగువన 22,700 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 31,980 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 22.200 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య 16.120 మీటర్లు నీటిమట్టం నమోదయ్యింది. స్పిల్వేలోకి వస్తున్న అదనపు జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ప్రాజెక్ట్ దిగువన 10.70 మీటర్లు నమోదయిందని ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గిందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో ఆర్‌డిఒ పర్యవేక్షణ

ఏలూరు : కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలకు దాచారంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో, తాడువాయి, ములగలంపల్లిలో ఏర్పాటు చేసిన వరద పునరావాస శిబిరాల్లో ఆదివారం సహాయ, పునరావాస కార్యక్రమాలను అధికారులు దగ్గరుండి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు వరద సహాయ పనుల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఉదయం కూడా రేపాకగొమ్ము గ్రామంలోని కొన్ని కుటుంబాలను తాడువాయి, ములగలంపల్లిలో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాలకు తరలించే పనులను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎం.వి.రమణ పర్యవేక్షించారు. దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో ప్రజలకు భోజనం తయారీని ఆర్‌డిఒ పరిశీలించి, ప్రజలకు వడ్డించారు. వర్షాలు, వరదలకు ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు టార్పాలిన్లు అందిస్తున్నారు. సహాయ పునరావాస కార్యక్రమాల్లో ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా ఆర్‌డిఒ పర్యవేక్షిస్తున్నారు. ఆయన వెంట కుక్కునూరు, వేలేరుపాడు తహశీల్దార్లు రమేష్‌కుమార్, జి.సత్యనారాయణ, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో గోదావరి పరివాహక ప్రాంతాలైన రుద్రంకోట, రేపాకగొమ్ము, తాట్కూరు గొమ్ము గ్రామాల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి ఆదివారం సాయంత్రానికి 31.06 అడుగులతో నిలకడగా ఉందని అధికారులు తెలియజేశారు. ప్రస్తుతానికి గోదావరి ఇబ్బందులు లేకపోయినా ఆగస్టు, సెప్టెంబర్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ముంపు ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి తగ్గుముఖం పట్టినా గానీ బోళ్లపల్లి వద్ద ఉన్న ఎద్దువాగు కాజ్‌వే మునిగి ఉండడంతో ఇంకా రెండు, మూడు రోజుల వరకూ కోయిదా, కట్కూరు, సిద్దారం తదితర 18 గ్రామాల్లోని ప్రజలు రహదారుల సౌకర్యం లేక నానా అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముమ్ముందు వరదలు పెరిగితే పిల్లాపాపలతో. తినడానికి తిండి లేక సరైన వసతి లేక ఎన్ని. ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం : ఎంఎల్ఎ

మెగా జాబ్ మేళాను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగాల కల్పనకు తణుకులో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా ఒక వేదికగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నాయన్నారు. ముందుగానే దాదాపు 3,500 మంది రిజిస్ట్రేషన్లు చేసుకుని ఉద్యోగ మేళాకు అభ్యర్థులు హాజరైయ్యారని తెలిపారు. దేశంలో దాదాపు 50 శాతం మంది యువత ఉన్నారని, భవిష్యత్తులో యువతకు దేశాన్ని నడిపించగలిగే శక్తి ఉందన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపట్టాయని తెలిపారు. ప్రపంచంలో ఏమూల ఉద్యోగావకాశాలు ఉన్నా వదులుకోకుండా వాటిని అందిపుచ్చుకోవడం ద్వారా భవిష్యత్తు సుగమం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, దేశ ప్రధాని నరేంద్రమోడీ సహకారంతో ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే దాదాపు రూ.9.30 లక్షల కోట్లు పెట్టుబడితో పరిశ్రమలు ఏర్పాటు చేసి సుమారు 4.50 లక్షల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. కేవలం రాజకీయ అవసరాల కోసమో లేదా ప్రచారం కోసమో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేయలేదని, తణుకు నియోజవర్గంలోని యువత భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తణుకులో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు వచ్చిన అనూహ్య స్పందన చూస్తే యువత ఎంత మేర ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారో అర్థమవుతుందని అన్నారు. ఉద్యోగాలు రావడం ముఖ్యం కాదని ఇలాంటి జాబ్ మేళాలో పాల్గొని ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవడం ప్రధానమని అన్నారు. భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తాను సింగపూర్‌లో ఉద్యోగావకాశాల కోసం వెళ్లిన సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డానని గుర్తు చేసుకున్నారు. ఉద్యోగంలో చేరిన మొదటి రోజుల్లో ఇబ్బందుల ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలని సూచించారు. బహుళ జాతి సంస్థలే కాకుండా స్థానికంగా ఉండే సంస్థలు సైతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగాలు రాకపోయినప్పటికీ అభ్యర్థులు ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీడ్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆరు నెలల శిక్షణ ఇచ్చి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. మీ సమస్య మా పరిష్కారం పేరుతో ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసేవకు క్లబ్‌లు కృషిచేయాలి

రీజనల్ ఛైర్మన్ వి.శ్యామల

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజలకు మరింత సేవలందించేందుకు క్లబ్బు నిరంతరం కృషిచేయాలని రీజనల్ ఛైర్మన్ వి.శ్యామల అన్నారు. పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయం వద్ద ఆదివారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని జోన్ ఛైర్మన్ అప్పన్న బద్రీలతో కలిసి పరిశీలించారు. జగన్నాథస్వామి గోశాలలో పశువులకు వివిధ రకాల కూరగాయలు, దాణ, డెస్ట్ బిన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఎంబర్మన్నార్ ఆలయంలో భక్తులు కూర్చేందుకు వీలుగా బెంచీలు బహూకరించారు. ఈ



రీజనల్ ఛైర్మన్ దంపతులను సన్మానిస్తున్న నూలి శ్రీనివాస్

కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నూలి శ్రీనివాస్, కంచర్ల బాబీ, కోట్ల బాలకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' కొందరికే..!

రెండో జాబితాలోనూ అర్హులకు చుక్కెదురు
గ్రీవెన్స్‌లో సమస్య పరిష్కారమైనా పాత కారణాలు చూపిస్తూ నిలుపుదల
లబోదిబోమంటున్న అర్హులైన విద్యార్థులు, తల్లిదండ్రులు
ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 50 వేల మందికి అందలేదని అంచనా
తల్లికి వందనం లెక్కలపై గోప్యత పాటిస్తున్న అధికారులు
తమకు తెలియవంటూ ఉత్సవ విగ్రహంలా మారిన విద్యాశాఖ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం అత్యంత గొప్పగా చెబుతున్న 'తల్లికి వందనం' కొందరికి మాత్రమే అందడం చర్చనీయాంశంగా మారింది. గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులపై అంతా బాగా ఉందని చెప్పినప్పటికీ అర్హుల జాబితాలో మాత్రం పేరు రాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. అర్హత ఉన్నా తల్లికి వందనం అందని విద్యార్థులు ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లో దాదాపు 50 వేల మంది వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేదుకు తల్లికి వందనం లెక్కలు ప్రభుత్వం గోప్యంగా ఉంచుతున్నట్లు కనిపిస్తోంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. జూన్ 12వ తేదీన తల్లికివందనం సొమ్ములు ప్రభుత్వం విడుదల చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో 1,76,574 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తేల్చారు. ఇంకా 41,703 మంది విద్యార్థులను అనర్హుల జాబితాలో చేర్చారు. ఏలూరు జిల్లాలో 2,15,082 మంది విద్యార్థులను అర్హులుగా తేల్చగా, దాదాపు 60 వేల మంది విద్యార్థులు అనర్హుల జాబితాలో ఉండిపోయారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తల్లికి వందనం రాని విద్యార్థులంతా గ్రీవెన్స్‌లో సంబంధిత పత్రాలు అందించాలని ప్రభుత్వం పేర్కొంది. జూన్ 20వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. 300 యూనిట్లు దాటినట్లు పేర్కొనడం, భూములు లేకపోయినా ఉన్నట్లు చూపించడం, కారులేకపోయిన ఉన్నట్లు చూపడంతో చాలా మంది విద్యార్థులకు తల్లికి వందనం రాలేదు. ఇలాంటి వారంతా రవాణా, విద్యుత్, రెవెన్యూ శాఖల నుంచి పత్రాలను తీసుకుని సచివాలయాల్లో అందించారు. పత్రాలు అందించిన తర్వాత ప్రభుత్వం పేర్కొన్న ఎనిమిది అంశాలకు సంబంధించి సంతృప్తి (శాటిస్‌ఫైడ్) చెందినట్లు ఆన్‌లైన్‌లో చూపించారు. కొత్తగా ఒకటో తరగతిలో, ఇంటర్ మొదటి ఏడాదిలో చేరిన వారికి సంబంధించిన వారితో కలిపి రెండో జాబితాను జులై పదో తేదీన ప్రభుత్వం విడుదల చేసింది. రెండో జాబితాలోనూ చాలా మంది పేర్లు లేకుండా పోయాయి. ఆన్‌లైన్‌లో సంతృప్తి చెందినట్లు చూపించిన పేర్లు మాత్రం జాబితాలో కనిపించడం లేదు. దీంతో బాధిత తల్లిదండ్రులంతా లబోదిబోమంటున్నారు. అర్హత ఉండి తల్లికి వందనం అందని విద్యార్థులు 50 వేలకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి మళ్లీ అవకాశం కల్పిస్తారా.. ఈ ఏడాదికి ఎగనామం పెట్టేస్తారా అన్న చర్చ జనాల్లో సాగుతోంది. తల్లికి వందనం కొందరికే అందడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లెక్కలు చెప్పకుండా గోప్యత..

తల్లికి వందనం అమలుకు సంబంధించి ప్రభుత్వ నుంచి సరైన సమాచారం లేకుండా పోయింది. జిల్లాలో ఎంత మంది విద్యార్థులకు తల్లికి వందనం అందించారు. ఎన్ని రూ.కోట్లు జిల్లాకు అందాయో కూడా లెక్కలు చెప్పడం లేదు. గత వైసిపి ప్రభుత్వం జిల్లాకు సంబంధించి వివరాలతో కూడిన ప్రకటనను విద్యాశాఖ విడుదల చేసింది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. మెగా పేరెంట్స్ సమావేశాల్లో సైతం ఏ స్కూల్లోనూ తల్లికి వందనం జాబితాలు బయట పెట్టని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇదంతా కావాలనే చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తల్లికి వందనం జిల్లాలో ఎంతమందికి వచ్చింది. ఇంకా అనర్హుల జాబితాలో ఎంతమంది ఉన్నారో వంటి లెక్కలు విద్యాశాఖ విడుదల చేయాలని అంతా కోరుతున్నారు. దీనిపై రెండు జిల్లాల ఉన్నతాధికారులు సైతం సరిగ్గా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నరసాపురం లేసుకు మరో అరుదైన గుర్తింపు

వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక
నేడు ఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఇప్పటికే దేశ విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన నరసాపురం లేసుకు మరో అరుదైన గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వంచే అమలు చేస్తున్నా ఒక జిల్లా, ఒక ఉత్పత్తి అవార్డు కింద 2024 -25 గాను నరసాపురం లేసు అల్లికు ఎంపికైంది. 2024-25 రాష్ట్రం నుంచి 26 జిల్లాల ఉత్పత్తులను పోటీలో ఉంచగా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపిక కాగా, నరసాపురానికి చెందిన లేసు అల్లికలు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ పురస్కారాన్ని అందుకునేందుకు కలెక్టర్ చదలవాడ నాగరాణి ఢిల్లీ వెళ్లారు. న్యూఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో ఓడిఓపి అవార్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖల మంత్రి చేతుల మీదుగా కలెక్టర్ నాగరాణి స్వీకరించనున్నారు.

లేసుకు అంతర్జాతీయ గుర్తింపు

నరసాపురం లేసుకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం లేసు ఉత్పత్తుల అలంకరణ కనపడుతుంది. ఇతర రాష్ట్రాలు, దేశాలకు లేసు అల్లికలు ఆన్‌లైన్ ప్లాట్ ఫారం ద్వారా ఎగుమతి అవుతున్నాయి. లేసు అల్లికలకు గత కొద్ది నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. ఈ అవార్డు కూడా కలెక్టర్ నాగరాణి అందుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా నాగరాణి పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి లేసు పార్క్‌పై ప్రత్యేక దృష్టి సారించి మళ్లీ లేసు ఉత్పత్తులకు పూర్వవైభవం తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. వీటికి ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించడంలో బలం చేకూరింది. తరచూ లేస్ పార్క్‌ను సందర్శిస్తూ వారు తయారు చేస్తున్న డిజైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు సూచనలను ఇవ్వడంతో అల్లికదారులు మరింత వినూత్న డిజైన్లు రూపొందించి ప్రదర్శించడం జరుగుతోంది. అయితే ఇటీవల కాలంలో పలు రాష్ట్ర, కేంద్ర అవార్డులను సొంతం చేసుకోవడం జిల్లాకు ఎంతో గర్వకారణం.

గోదావరి పుష్కరాలను విజయవంతం చేద్దాం

మంత్రి నిమ్మల రామానాయుడు

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

వచ్చే 2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని, దీనికి సంబంధించి అభివృద్ధి పనులకు ఇప్పటి నుంచే రూపకల్పన చేసుకోవాలని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక రామచంద్ర గార్డెన్లో నియోజకవర్గస్థాయి అధికారులు, కూటమి నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. శాఖల వారీగా చేపట్టబోయే అభివద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన శాశ్వత అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యతివ్వాలన్నారు. మహా కుంభమేళాకు ధీటుగా గోదావరి పుష్కరాలు జరపాలనేది ముఖ్యమంత్రి ఆశయమన్నారు. గోదావరి నదికి 2027 జులై 23 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకూ పుష్కరాలు జరుగుతాయని చెప్పారు. నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద, ట్రెయినీ డిఎస్‌పి మానస, విద్యుత్ శాఖ ఎస్ఇ, దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారి హరి సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్.రాజు సేవలు ఎనలేనివి

ఎంఎల్ఎ అంజిబాబు, రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ

మాట్లాడుతున్న ఎంఎల్ఎ అంజిబాబు

కాళ్ల : న్యూక్లియర్ ఫిజిక్స్ శాస్త్రవేత్త, గాంధీయవాది, మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ముదుండి రామకృష్ణంరాజు(ఎంఆర్ రాజు) సేవలు ఎనలేనివని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. పెదఅమిరంలోని మహా త్మాగాంధీ మెమోరియల్ ట్రస్ట్‌లో పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్.రాజు సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సభకు పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ, డాక్టర్ సత్యనారాయణ మూర్తి(బాబ్జి) అధ్యక్షత వహించారు. ఎంఎల్ఎ అంజిబాబు పాల్గొని మాట్లాడుతూ 35 ఏళ్లుగా అన్ని దేశాలలో కేన్సర్‌లో పరిశోధనలు చేసిన మహోన్నత వ్యక్తి అని, 2013 పద్మశ్రీ పురస్కారం అందుకున్నారని, పెద అమిరంలో మహత్మగాంధీ మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఎంతో మంది కేన్సర్ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించారన్నారు. డాక్టర్ ఎంఆర్.రాజు సేవలు గుర్తించి ఆనాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం 2006లో పెద ఆమిరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ సందర్శించి ఎంఆర్.రాజు సేవలను కొనియాడారని గుర్తుచేశారు. రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ మాట్లాడుతూ ఎంఆర్ రాజు ఎంజిఎం ట్రస్ట్ ద్వారా కేన్సర్ రోగులకు విశేష సేవలందించిన సేవా మూర్తిఅని పేర్కొన్నారు. ఆయన మరణం తీరని లోటని, భౌతికంగా లేకపోయిన ఆయన సేవలు ఎప్పటికి చిరస్మరణీయంగా నిలిచిపోయే ఉంటాయన్నారు. ఈ సభలో డాక్టర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఎంఆర్.రాజు నిత్యం సమాజం బాగుకోసం తపన పడేవారన్నారు. ఎంజిఎం టెస్ట్ ద్వారా కేన్సర్ రోగుల కోసం వైద్యం అందించారన్నారు. జిల్లా కేంద్రం భీమవరంలో సైన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని బొండా వెంకట సుబ్బారావు, ఇందుకూరి ప్రసాదరాజులు ఎంఎల్ఎ అంజిబాబు దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సభలో ఎంఆర్ రాజు కుమారులు మంతెన రామ్‌కుమార్ రాజు, దంతులూరి రంగరాజు, కుటుంబ సభ్యులు, వి.విజయకుమార్ రాజు, ఎస్‌బి.వర్షిని, సత్యనారాయణ రాజు ఉన్నారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కి ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

సముద్ర కెరటాలలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పెరిగిన గోదావరి..

ప్రజల్లో వరద గుబులు

పరవళ్లు తొక్కుతున్న చినకాపవరం డ్రెయిన్

ప్రజాశక్తి - ఆకివీడు

మహారాష్ట్ర, బొంబాయి, ఇక గోదావరి ఎగువ భాగాన వానలు పెరిగితే చాలు ఆకివీడులో గుండె గుబేలు మంటుంది. ఎక్కడ వరకు వరద వచ్చేస్తుందో అని రైతులు, సామాన్యులు సైతం బెకబెక లాడిపోతుంటారు. గోదావరి ఎడమపాయ చిట్టచివరి సముద్రంలో కలిసే భాగం ఆకివీడు మండలంలోనే ప్రవహిస్తుంది. గోదావరిలో కొంతమేర వరద ఈ ప్రాంతం గుండానే ముందుకు సాగాలి. గోదావరి ఎడమ కాలవ శెట్టిపేట, నిడదవోలు, తాడేపల్లిగూడెం, గణపవరం మీదుగా ఆకివీడులో ప్రవేశించే వెంకయ్య కాలువ చినకాపవరం వద్ద విడిపోతుంది. మూడు భాగాలలో ఒక భాగం చినకాపవరం డ్రెయిన్ పేరుతో ఆకివీడు మీదుగా ఉప్పుటేరులో నుంచి సముద్రంలో కలుస్తుంది. ఈ మార్గంలో చినకాపవరం డ్రెయిన్ ఈ వరద నీటికి పొంగి పొర్లుతుంది. కాలువ దశాబ్దాల తరబడి తవ్వకానికి నోచుకోలేదు. అదనంగా ఆక్రమణల పాలైంది. అయినా సరే పట్టించుకునే నాధుడే లేడు. దీంతో సుమారు డెల్టాలోని లక్ష ఎకరాల పైబడి వరిసాగు, మురుగు ఈ కాలవగుండానే సముద్రంలోకి చేరాలి. దీంతో కాలువకు నీటి ప్రవాహ ఒత్తిడి పెరగడంతో వరదలు రావడం అత్యంత సహజంగా మారిపోయింది. ప్రతి ఏటా ఇక్కడ తాత్కాలిక చర్యలు చేపట్టడం తప్ప శాశ్వత నివారణ చర్యలు ఏఒక్కరూ చేపట్టకపోవడంతో ఇది సర్వసాధారణంగా మారిపోయింది. ఈ వరదలతో వందలాది కుటుంబాలు నీట మునుగుతున్నాయి. వారిని తాత్కాలికంగా శిబిరాల్లోకి తరలించడం తప్ప శాశ్వత నివారణ ఏఒక్కరూ చేపట్టడం లేదు. దీంతో వరద వచ్చిందంటే చాలు అక్కడ సాధారణ ప్రజానీకంతో పాటు రైతాంగం కూడా నష్టపోతున్నారు. ఆ నష్టాన్ని తిరిగి పూడ్చుకునే మార్గమే లేక అల్లాడుతున్నారు.

చినకాపవరం డ్రెయిన్

తాగునీరందించండి మహాప్రభో..

సిపిఎం మండల నాయకులు పిల్లి ప్రసాద్

ప్రజాశక్తి - పోడూరు

స్వచ్ఛమైన, శుద్ధిచేసిన తాగునీరు అందించాలని సిపిఎం మండల నాయకులు పిల్లి ప్రసాద్, జిన్నూరు శాఖ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. జిన్నూరు శాఖ సమావేశం గుబ్బల గంగారాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి తాగునీరు లేక ప్రజలు అల్లాడి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిన్నూరుకి మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి సైకిల్ పైనా మోటారు సైకిల్ పైనా తెచ్చుకుంటున్నారని, వృద్ధులు మంచి నీరు టిన్నుకి రూ.20-30 ఇచ్చి కొంటున్నారని తెలిపారు. వెంటనే శుద్ధిచేసిన నీరు ప్రజలకు అందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు తాళ్లూరి భాగ్యం గంధి, వెలుదుటి నాగేశ్వరరావు, చివటపు ఆంజనేయులు, దాడి గవర్రాజు, కేతల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి : ఎంపిటిసి

ఉండి : అర్హత కలిగి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని పాములపర్రు గ్రామ ఎంపిటిసి, ఉండి మండల జనసేన అధ్యక్షుల యడవల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పాములపర్రు గ్రామంలో కార్యదర్శి డి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి హామీ చట్టంపై గ్రామ సభను ఉద్దేశించి వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు తోట శ్రీరాములు మాట్లాడుతూ గ్రామంలో 230 జాబ్ కార్డులు ఉండగా 184 జాబ్ కార్డుదారులు సద్వినియోగం చేసుకున్నారని, మొత్తం అందరూ ఈ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ అమృతరావు మాట్లాడుతూ గ్రామంలో గత సంవత్సరానికి సంబంధించి సుమారు 25 లక్షల వ్యయంతో 20 పనులను నిర్వహించారని, ఇందులో సుమారు రూ.19 లక్షలు అధికంగా చెల్లించినట్లు తమ తనిఖీలో తెలిసిందన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేసన యాదగిరి, కేసన బలుసులరావు, వార్డు సభ్యులు దర్శి సాల్మన్ రాజు, డిఆర్‌పి శ్రీరామ్, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా 'పిజిఆర్ఎస్'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 14వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా నిర్వహించనున్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.

సారె అందజేత

కాళ్ల : ఏలూరుపాడు గ్రామంలో వేంచేసియున్న ఎల్లమ్మ, కొండాలమ్మ, పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు మహిళలు ఆషాఢమాస సారెతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో గ్రామదేవతలకు సారె సమర్పించే క్రమంలో ఆషాఢమాసం పురస్కరించుకొని అమ్మవార్లకు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, మంతెన ఆంజనేయరాజు, దాట్ల శ్రీనివాసరాజు, స్కాట్లాండ్ సామరాజు, దండు సుబ్రహ్మణ్యం రాజు, దాట్ల శ్రీనివాసరాజు, దాట్ల రవి, పడమట సుబ్బయ్య, మాన్యం రమేష్, పడమట సతీష్, నాగార్జున పాల్గొన్నారు.

ఉండి: మండలంలోని కలిసిపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీమాలేశ్వమ్మ అమ్మవారు ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం ప్రజలు గ్రామ ఆడపడుచులా భావించి సారె సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కేసబోయిన జానకి, ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, బోయిన రాము, కానుబోయిన సత్తిబాబు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. భీమవరం గ్రామీణ మండలం దొంగపిండి గ్రామానికి చెందిన తిరుమని శ్రీపూజ నెల్లూరు జిల్లా కందుకూరు డివిజన్ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీపూజ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ ఇఒ మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేరాలు - ఘోరాలు

సంతకు వెళ్లి వస్తానని..

ప్రజాశక్తి - గణపవరం

సంతకు వెళ్లి వస్తానన్న తన భర్త శవంగా రావటంతో భార్య కన్నీటి పర్యంతమైన ఘటన స్థానికంగా చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే చిలంకంపాడు గ్రామానికి చెందిన గాలి సత్యనారాయణ(29) శనివారం రాత్రి పిప్పర సంతకువెళ్లి కూరగాయలు తీసుకు వస్తానని చెప్పి వెళ్లి అక్కడ నుంచి తిరిగి వస్తుండగా రోడ్డు పక్కన ఆగి ఉన్న సెప్టిక్ ట్యాంకు లారీని బలంగా తన వాహనంతో ఢీకొనటంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని గణపవరం ఎస్ఐ చింతకాయలు సత్యనారాయణ పరిశీలించి కుటుంబ సభ్యుల వద్ద వివరాలు సేకరించారు. చనిపోయిన సత్యనారాయణకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యనారాయణ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదివారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. చిన్నవయసులోనే రోడ్డు ప్రమాదంలో చనిపోవటంతో చిలకంపాడులో విషాదఛాయలు అలముకున్నాయి.

భార్యపై కత్తితో భర్త దాడి

చికిత్స పొందుతున్న బాధితురాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం అర్ధకట్ల గ్రామానికి చెందిన యాళ్లబండి వెంకట రమణ(52) ఇంట్లో శనివారం రాత్రి నిద్రిస్తుండగా ఆమె భర్త వెంకటేశ్వర్లు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనతో గ్రామం మొత్తం ఉలిక్కిపడింది. సంఘటన స్థలాన్ని ఆదివారం డిఎస్‌పి శ్రీవేద, సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ సురేంద్రకుమార్ పరిశీలించారు. భార్యభర్తల మధ్య గొడవలతో ఈ సంఘటన జరిగినట్లు అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు. గాయపడిన యాళ్లబండి వెంకటరమణ భీమవరంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ప్రస్తుతానికి ప్రాణాపాయం లేదన్నారు. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి పట్ల అసభ్య ప్రవర్తన..

ప్రజాశక్తి - ఉండి

ఇంటివద్ద ఒంటరిగా ఉన్న యువతిని అసభ్యంగా మాట్లాడుతూ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఉండి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాములపర్రు గ్రామానికి చెందిన వర్రే రాజేష్ అనే యువకుడు ఉండి నక్కరాజుగుంట ప్రాంతానికి చెందిన యువతి ఇంటి వద్ద ఒంటరిగా ఉండటంతో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఉండి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దొరికిన ద్విచక్ర వాహనం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జనసేన కార్యకర్త పోగొట్టుకున్న ద్విచక్ర వాహనం దొరికిన సంఘటన స్థానికంగా చోటుచేసుకుంది. ఆదివారం స్థానిక జనసేన కార్యకర్తలు చెప్పిన కథనం ప్రకారం వారం రోజుల క్రితం మండలంలోని పొలమూరు గ్రామంలో ఇంటి ముందు నిలుపుదల చేసి ఉంచిన పల్సర్ ద్విచక్ర వాహనం దొంగిలించారు. ఆరోజు నుంచి జనసేన కార్యకర్తలు ఎక్కడికక్కడ బృందాలుగా విడిపోయి పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో వెతుకులాట ప్రారంభించారు. ఎట్టకేలకు వారి శ్రమ ఫలించి శనివారం ఒక మిత్రుడు ఇచ్చిన సమాచారంతో ద్విచక్ర వాహనం ఆచూకీ తెలిసింది. రేలంగి సమీపంలో ఓ యువకుడు వద్ద ఉన్న ఈ వాహనాన్ని స్థానిక ఇరగవరం పోలీస్ స్టేషన్లో వారు అప్పగించారు. టీం వర్క్‌గా చేసిన ఈ వెతుకులాటలో సహకరించిన మిత్రులతో పాటు వివిధ ప్రాంతాల్లో సహకరించిన వారందరికీ పొలమూరు గ్రామ జనసేన కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉత్తమ ర్యాంకర్లకు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన తమ మిత్రుని కుమారులను 1986-87 వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన పదవ తరగతి మిత్ర బృందం ఆదివారం సత్కరించింది. బాలేపల్లి గ్రామానికి చెందిన పాలా శ్రీనివాసరావు, జయశ్రీ కుమారులు రోహిత్ పాలీసెట్-2025 రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు, మరో కుమారుడు రోహన్ ఎపి ఆర్‌జెసి 2025లో 227 ర్యాంకు సాధించారు. భీమవరం తిరుమల పాఠశాలలో పదవ తరగతి పూర్తిచేసిన వీరు అదే కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఐఐటి లక్ష్యంగానే ముందుకు సాగుతున్నట్లు రోహిత్, రోహన్‌లు ప్రజాశక్తికి తెలిపారు. ఈ పదవ తరగతి మిత్ర బృందం బృందంగా ఏర్పడిన నాటినుండి ఉత్తమ ప్రతిభ కలిగిన వారిని అభినందిస్తూ అలాగే ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో యేలూరి భాను కుమారి, వలవల జానకిరామ్, ముద్రగడ శ్రీనివాసరావు, నిమ్మల దుర్గ, గుని శెట్టి మంగతాయారు, చల్లాయమ్మ, పంతం రాము, కోరసిక వీర్రాజు, ఆర్‌కె.నాయుడు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులందజేస్తున్న ఎంఎల్ఎ

ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ప్రజాశ్రేయస్సుకు పనిచేస్తుందని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద 45 మందికి రూ.33, 43, 731లు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు మరింతగా సాయపడాలని సిఎం చంద్రబాబుని కోరారు. ఇప్పటి వరకు తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి రూ.2 కోట్ల సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల నారాయణమూర్తి, రామిశెట్టి సురేష్, గుండుమోగుల సురేష్, చాపల రమేష్, పి.వెంకటరామయ్య, మద్దాల మణికుమార్, నీలిపాల దినేష్, బైనపాలేపు ముఖేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ఇంటికే పరిమితమైన అనారోగ్య వృద్ధులకు సంచారశకటం ద్వారా ఉచిత వైద్యసేవలు అందజేశారు. న్యూరోసైకియాట్రిస్ట్ డాక్టర్ బి.రమేష్‌కుమార్ తణుకు, పాలంగి ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురు వృద్ధులకు ఉచిత వైద్యసేవలందించారు. సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, సంఘ సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి జెడ్‌పి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన రేవు లక్ష్మీ గాయత్రి ట్రిపుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు తెలిపారు. ఆదివారం వెలువడిన రెండవ జాబితా ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ గాయత్రిని సర్పంచి అడ్డాల సూరిబాబు, ఎంపిటిసి తిరుమల స్వామి, పిఎంసి ఛైర్మన్ చూడామని, పాఠశాల సిబ్బంది, పలువురు గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వీరవాసరం

ఈనెల 14వ తేదీన 33 కెవి కొనితివాడ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎఇ అప్పారావు ఆదివారం తెలిపారు. భీమవరం నుంచి కొత్త లైన్ వేయటం నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలో కొనితివాడ సబ్‌స్టేషన్ పరిధిలో కొనితివాడ, మడుగు పోలవరం, నేలపోగుల, పొలమూరు ఇండస్ట్రియల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

అనధికార లేఅవుట్‌తో రైతుల అవస్థలు

చర్యలు చేపట్టాలని వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

అనధికార లేఅవుట్‌తో పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం మొగల్తూరులోని అనధికారకంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు వంటకాలువ గట్టు ఆక్రమించుకుని రహదారి నిర్మాణం చేశారు. మొగల్తూరు పెదగొల్లగూడెం ప్రాంతంలో మండలపరిషత్తు పోలీస్ స్టేషన్ రోడ్డుకు ఆనుకుని గతంలో సుమారు మూడు ఎకరాల్లో అనధికారకంగా లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఆ లేఅవుట్లో స్థలాల క్రయ, విక్రయాలు జరగలేదు. ఇటీవల ఆ స్థలాల విక్రయానికి వీలుగా లేఅవుట్‌లో ప్లాట్లను విక్రయించేందుకు నిర్వాహకులు రహదారుల నిర్మాణం చేపట్టారు. దీంట్లో భాగంగా లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న న్యూచానల్ గట్టు ఆక్రమించి దానిపై రహదారి నిర్మాణం చేపట్టారు. రహదారి నిర్మాణంలో భాగంగా న్యూచానల్ గట్టుపై వేసిన కంకర రాళ్లు చానల్లోకి జారుతున్నాయి. దీంతో తమకు ఇబ్బందులు తప్పవని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలిగించాలని రైతులు కోరుతున్నారు. సమస్యను ప్రజాశక్తి తహశీల్దారు కె.రాజకిశోర్ దృష్టికి తీసుకువెళ్లగా భూ మార్పిడికి అనుమతికి పత్రాలు నివేదించారని, న్యూచానల్ గట్టుపై చేపట్టిన రహదారికి సంబంధించి వెంటనే తగు చర్యలు చేపడతానని తెలిపారు.

బోదె గట్టుపై అక్రమంగా ఏర్పాటు చేసిన రహదారి నిర్మాణం

కోట శ్రీనివాసరావు మృతి సినీరంగానికి తీరనిలోటు

ప్రజాశక్తి - గణపవరం

విజయవాడ మాజీ ఎంఎల్ఎ, చలనచిత్ర నటుడు పద్మశ్రీ కోటశ్రీనివాసరావు మృతి సినీరంగానికి తీరని లోటని అఖిల భారత హ్యాండ్‌లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు తమ సంతాపం వ్యక్తంచేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సినీరంగంలో తనకంటు ప్రత్యేక స్థానాన్ని పొందిన కోట శ్రీనివాసరావు రాజకీయ రంగంలో తనదైన శైలిలో సేవలందించారని అన్నారు. కోట మృతి సినీ రంగానికి తీరని లోటని తెలిపారు.

1996లో కోట శ్రీనివాసరావుకు పాలకొల్లులో సత్కారం

పాలకొల్లు : 1996, మే 16, 17, 18, 19 తేదీలలో పాలకొల్లులో నిర్వహించిన లలిత కళాంజలి నాటక అకాడమీ 16వ జాతీయస్థాయి నాటికల పోటీలలో ప్రముఖ సినీ నటులు కోట శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ప్రముఖ సినీ దర్శకుడు కోడి రామకృష్ణ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ప్రముఖ సినీనటి రోజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బొండాడ వెంకట్రాజు గుప్త, కొటికలపూడి రాజమోహనరావు, అధ్యక్షులు యియ్యపు రామలింగేశ్వరరావు, కార్యదర్శి, ఇందుకూరి దిలీప్ కుమార్‌రాజు, పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు.

పలువురు సంతాపం..

కోట శ్రీనివాసరావు మృతి పట్ల పాలకొల్లు కళాపరిషత్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ, కార్యదర్శి జక్కంపూడి కుమార్, గౌరవ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కెఎస్‌పిఎన్.వర్మ, విటాకుల రమణ, వ్యవస్థాపకులు మానాపురం సత్యనారాయణ, కోశాధికారి కొణిజేటిగుప్త, దాసరి నాని, రెడ్డి వాసు, షేక్ పీర్ సాహెబ్, సోమంచి శ్రీనివాస శాస్త్రి, నడపన శ్రీనివాస్, కొల్లికొండ ప్రసాద్, అంగర వీరభద్ర కుమార్, జిఎస్ఎన్.రవి సంతాపం వ్యక్తంచేశారు. విలక్షణ నటుడు మృతిపట్ల సీనియర్ కళాకారులు వంగా నర్సింహారావు, గుడాల హరిబాబు, చేగొండి సత్యనారాయణ మూర్తి, యర్రంశెట్టి వెంకటరత్నం, కెవి.కృష్ణ వర్మ సంతాపం వ్యక్తం చేశారు.

ఆకివీడు : ప్రముఖ సినీ నటుడు, మాజీ ఎంఎల్ఎ కోటా శ్రీనివాసరావు మరణం పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. సరిగమ సంగీత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు, ప్రముఖ కళా ప్రోత్సాహకులు, వినియోగదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలి, పలువురు కళాకారులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రూబిక్స్ ఆఫ్ కాంట్రాక్ట్ రచయిత పెనుగొండ వాసి..

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

హైదరాబాద్ సమీర్పేటలోని నల్సార్ న్యాయ యూనివర్సిటీలో ఈనెల 12న నిర్వహించిన 22వ నల్సార్ యూనివర్సిటీ స్నాత కోత్సవంలో రూబిక్స్ ఆఫ్ కాంట్రాక్ట్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఇద్దరూ రచయితలు రచించిన వారిలో ఒకరు పెనుగొండకు చెందిన అడ్వకేట్ అడపా వెంకట సుబ్బారాయుడు పెనుగొండకు చెందిన వ్యక్తి కావడం విశేషం. ఈయన అడ్వకేట్ ఇందుగకపల్లి రామానుజరావు కుమారుడు. ఈయన రచించిన పుస్తకాన్ని భారత ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ గవాయి, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్.నరసింహ, సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రపాలిత న్యాయశాఖ కార్యదర్శి అమిత్ యాదవ్, నల్సార్ వైస్ ఛాన్సలర్ శ్రీకృష్ణ, దేవరావు చేతులమీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ అడపాల వెంకట సుబ్బారాయుడుకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

మొగల్తూరులో బస్ షెల్టర్ ప్రారంభం

మొగల్తూరు : ప్రయాణికుల సౌకర్యార్థం దాతలు ఏర్పాటు చేసిన బస్టాండును కుటుంబ సభ్యులు మరమ్మతులు చేసి తిరిగి ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. గ్రామానికి చెందిన పొన్నపల్లి నాగేశ్వరరావు మొగల్తూరులోని లాకు ప్రాంతంలో ప్రయాణికులు వేచి ఉండేందుకు వీలుగా బస్టాండ్ ఏర్పాటు చేశారు. ఆర్‌టిసి బస్సులు స్థానిక గాంధీభవన్ సెంటర్ లాకు ప్రాంతం మీదుగా ముత్యాలపల్లి, కాళీపట్నం, బంటుమిల్లి, మచిలీపట్నం వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. దీంతో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు బస్టాండ్‌కు మరమ్మతులు చేసి శుభ్రం చేశారు. బస్టాండ్ సర్పంచి మేరీ సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పొన్నపల్లి త్రినాధ్ వడయార్, లక్ష్మీ మోహన్, కడలి త్రిమూర్తులు ఉన్నారు.

అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు

ఛైర్ పర్సన్ బర్రె వెంకటరమణ

ప్రజాశక్తి - నరసాపురం

వ్యాపారస్తుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తక్కువ మొత్తానికి నరసాపురం పట్టణంలో మార్కెట్ బహిరంగ పాటను ఖరారు చేశామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ అన్నారు. ఇప్పటి వరకు 9 సార్లు బహిరంగ వేలం పాటను వివిధ కారణాల వల్ల వాయిదా వేయడం జరిగిందని, 10వ సారి రూ.38 లక్షలకు పాటను కౌన్సిల్ ఆమోదం మేరకు ఖరారు చేశామన్నారు. గెజిట్ ప్రకారం రోజువారి మార్కెట్ వసూళ్లు చేయాలని, ప్రతి వ్యాపారస్తుడు రసీదు తీసుకుని డబ్బులు చెల్లించాలని ఛైర్‌పర్సన్ తెలిపారు. అధికంగా వసూలు చేస్తే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలిఅడుగు



ఉండిలో..

ప్రజాశక్తి - ఉండి

ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు టిడిపి కృషి చేస్తుందని పాములపర్రు గ్రామ అధ్యక్షులు తోట శ్రీరాములు అన్నారు. ఆదివారం సాయంత్రం పాములపర్రు గ్రామంలో ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తోట శ్రీరాములు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని పంచాయతీ మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని వారికి ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి, జనసేన మండల అధ్యక్షుడు యడవల్లి వెంకటేశ్వరరావు, నాయకులు కేసన యాదగిరి, కేసన బలుసుల రావు, వర్రే బాలాజీ పాల్గొన్నారు.

పెనుమంట్ర : కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం ఆచంట ఎంఎల్ఎ పితాని తనయుడు పితాని వెంకట్ ఆధ్వర్యాన చేపట్టారు. మండలంలోని నెగ్గిపూడి గ్రామ శివారు వనంపల్లి గ్రామంలో ప్రతి ఇళ్లు తిరిగారు. ఈ సందర్భంగా స్థానిక కడలి నాగమణి కూతురు వికలాంగురాలు అయిన అమ్మాయి తమ ఇల్లు కూలిపోవడానికి సిద్ధంగా ఉందని ఆందోళన చెందంగా వెంకట్ వెంటనే స్పందించి హౌసింగ్ ఎఇకి ఫోన్ చేసి వికలాంగురాలికి వెంటనే ఇల్లు శాంక్షన్ చేయమని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్ష కార్యదర్శులు చిర్ల బాలాజీ రెడ్డి, కట్టా వెంకటరమణ, మాజీ వైస్ ఎంపిపి కట్టా బాలాజీ వనకుమార్, పాలా ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం పట్టణంలోని పలు వార్డులో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సిఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, కుంచె ఈశ్వరరావు, దొంగ పద్మారావు, నెల్లూరి వీరస్వామి, భారత గోవులు, పొగాకు బుజ్జి పాల్గొన్నారు.

ఎంఎల్ఎపై కేసులు పెట్టిన చరిత్ర వైసిపిది : మంత్రి

పాలకొల్లు : ఎంఎల్ఎ ఎన్నిక కాకముందు తనపై ఎటువంటి కేసులు లేవని అయితే 2019 వైసిపి పాలనలోనే తనపై 25 కేసులు బనాయించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో ఆదివారం పాత్రికేయులతో గెట్ టు గెదర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో, 2019లో ఎంఎల్ఏగా పోటీ చేసినప్పుడు ఎటువంటి కేసులు లేనట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపినట్లు చెప్పారు. అయితే గత శాసనసభ ఎన్నికల్లో 25 కేసులు ఉన్నట్లు పెట్టవలసి వచ్చిందని అవన్నీ వైసిపి, తాను ఎంఎల్ఏగా ఉన్నా పెట్టిన కేసులు అన్నారు. తాను అభివృద్ధికి బాటలు వేస్తుంటే వైసిపి తనపై ఎంఎల్ఏగా ఉన్నప్పుడే దాడి చేసి పైగా ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టినట్లు చెప్పారు. లక్షా 90 వేలు ఓట్లు ఉన్న పాలకొల్లులో తాను 72 వేల భారీ మెజారిటీతో గెలిచానని, కొన్ని చోట్ల లక్ష మెజార్టీ వచ్చిన 3 లక్షల మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. తప్పుడు ప్రచారాలు చేసే వారిపై మీడియా జాగ్రత్తగా ఉండాలని కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No. 13/2024 in O.S.No. 214/2016

Between:

రేగాని సూర్యకాంతం ...D.H.R

అండ్

సమయం లక్ష్మి others ...J.D.Rs

To. 2nd JDr:
Samayam Srinivas,
S/o. Kanta Rao, D.No. 13-9-10/4
Rama Chandra Rao Peta,
Tadepalligudem, TPGSCJC

పై నెంబరు E.P. లో 2వ JDr కు ఎన్నిసార్లు నోటీసులు పంపినను E.P. సంగతులు తెలిసి యుండి సదరు నోటీసులు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substitute Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి **ది. 23-07-2025 వ సంIIరం తేదికి** వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున **ఉదయం గం. 10-30 నిIIలకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నెంబర్ E.P. తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పసుపులేటి శ్రీనివాస్
తాడేపల్లిగూడెం — అడ్వకేట్ ఫర్ Dhr
ది.10-07-2025 — తాడేపల్లిగూడెం

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో

O.S.N. 158/2024

Between:

మల్లుల నాగమల్లేశ్వరరావు ...వాది

మరియు

గోడి రాజ్‌కుమార్ ...ప్రతివాది

గోడి రాజ్‌కుమార్, తండ్రి: రామరాజు, D.No. 25-11-15/1, శంభుని పేట,పాలకొల్లు, ప.IIగో.IIజిల్లా, PJCJC

పై నెంబరు దావాలో ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం సమన్లు శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా జారీచేయగా ప్రతివాది ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొననందున శ్రీ కోర్టు వారు ఈ పత్రికాభిముఖంగా సమన్లు జారీ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున ప్రతివాది **ది. 31-07-2025 వ సంIIరం తేదీన ఉదయం గం. 10-30 నిIIలకు** శ్రీ కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా కాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని ఎడల సదరు గ్రంధం మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బొంతు నాగభూషణరావు (గాంధీ)
బొంతు ప్రతిభ
పాలకొల్లు — అడ్వకేట్స్
ది. 12-07-2025 — పాలకొల్లు - 534260
ఫోన్: 226656 సెల్: 98495 92095

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, నరసాపురం

O.S.No. 359/2021

Between:

గొల్లమందల సునీత ...వాది

మరియు

మైలాబత్తుల దైవ ఆశీర్వాదం వగైరాలు ...ప్రతివాది

"సాధారణ పద్ధతిలో ఈ క్రింది వ్రాయైన మీకు సమన్లు అమలు కానందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ప్రకటన ద్వారా 2వ ప్రతివాదికి ప్రత్యామ్నాయ పద్ధతిలో సమన్లు జారీ"

ప్రతివాది-2:
పాలపర్తి కాంచన, W/o. లక్ష్మీనారాయణ,
D.No. 15-3-3-5, పాలపర్తి వారి వీధి,
నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై దావాలో Specific performance పరిహారం నిమిత్తం మీపై మరియు మరికొంత మందిపై దావా వేసి యుండుట వలన **ది. 11-08-2025 వ సంIIరం తేదీన ఉదయం గం. 10-30 నిIIలకు** స్వతహాగా కాని, ప్లీడరు ద్వారా కాని పై కోర్టు యందు హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు సదరు వ్యాజ్యమును తీర్మాణం చేయబడును.

అమరేశ్వరరావు కె.
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం
ది. 13-07-2025 — సెల్: 90637 77879

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, నరసాపురం

I.A.No. 447/2021 in O.S.No. 359/2021

Between:

గొల్లమందల సునీత ...పిటిషనరు

మరియు

మైలాబత్తుల దైవ ఆశీర్వాదం వగైరాలు ...రెస్పాండెంట్స్

"సాధారణ పద్ధతిలో ఈ క్రింది వ్రాయైన మీకు నోటీసులు అమలు కానందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ప్రకటన ద్వారా 2వ రెస్పాండెంట్‌కి ప్రత్యామ్నాయ పద్ధతిలో నోటీసు జారీ"

రెస్పాండెంట్-2:
పాలపర్తి కాంచన, W/o. లక్ష్మీనారాయణ,
D.No. 15-3-3-5, పాలపర్తి వారి వీధి,
నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై పిటీషనులో Not to Further alienate the petition Schedule Property పరిహారం నిమిత్తం మీపై మరియు మరికొంత మందిపై I.A. దాఖలు వేసి యుండుట వలన **ది. 11-08-2025 వ సంIIరం తేదీన ఉదయం గం. 10-30 నిIIలకు** స్వతహాగా కాని, ప్లీడరు ద్వారా కాని పై కోర్టు యందు హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు సదరు పిటీషన్‌ను తీర్మాణం చేయబడును.

అమరేశ్వరరావు కె.
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం
ది. 13-07-2025 — సెల్: 90637 77879